ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 సిద్దిపేట
శుక్రవారం 26 జనవరి 2024




గణతంత్ర వేడుకలకు సిద్ధమైన వేదిక

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

- వేదికగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం

సిద్దిపేట టౌన్, జనవరి 25 : 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. వేడుకల్లో భాగంగా కార్యక్రమాన్ని తిలకించేందుకు వచ్చే అతిథులు, ప్రజల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ జాతీయ జెండాను ఎగురవేసి జిల్లా అభివృద్ధిపై సమగ్ర సందేశాన్ని వినిపించనున్నారు.

గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం



హుస్నాబాద్, జనవరి 25 : జిల్లా ప్రజలకు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన దినం, సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా ఆవిర్భవించిన శుభ సమయమని పేర్కొన్నారు. రాజ్యాంగం అందించిన న్యాయాన్ని, స్వేచ్ఛ, సమానత్వాన్ని, సౌభ్రాతృత్వాన్ని గౌరవిస్తూ స్వరాష్ట్రాన్ని సురాష్ట్రంగా మార్చుకుందామని ఆయన కోరారు.

ముందుకు సాగని కాలువల పనులు

- 13 రోజుల పాటు తూతూ మంత్రంగా గౌరవెల్లి ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువ పనులు
- ఆ తర్వాత చేతులెత్తేసిన అధికారులు
- మంత్రి ఆదేశాలు బేఖాతర్!


గౌరవెల్లి ప్రాజెక్టు కాలువలో చెట్లను తొలగిస్తున్న కూలీలు(ఫైల్)

అక్కన్నపేట, జనవరి 25: అక్కన్నపేట మండలం గుడాటిపల్లి వద్ద నిర్మిస్తున్న గౌరవెల్లి ప్రాజెక్టు పనులు చివరి దశకు చేరడంతో దాదాపు 1 టీఎంసీ వరకు నీటిని నింపారు. అయితే కొందరు భూ నిర్వాసితులు ప్రాజెక్టు పనులపై ఎన్‌జీటీని ఆశ్రయించడంతో పనులు నిలిచిపోయాయి. ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు 47 కిలోమీటర్ల పొడవుతో కుడి కాలువ, 16 కిలోమీటర్ల పొడవుతో ఎడమ కాలువ నిర్మాణం చేపట్టారు. భూసేకరణ పూర్తికాకపోవడంతో నిర్మాణం పూర్తి కాలేదు. కుడి కాలువ నిర్మాణంలో సుమారు 10 కిలోమీటర్ల మేర లైనింగ్ వేసి మిగతా చోట్ల వదిలేసి కాంట్రాక్టర్లు చేతులు దులుపుకున్నారు. ఆ తర్వాత అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో వర్షాలకు వచ్చే వరద నీటి వల్ల పలుచోట్ల గండి


గౌరవెల్లి ప్రాజెక్టు కాలువలో పేరుకుపోయిన ముళ్లచెట్లు

పడింది. పూడిక మట్టి కాలువ నిండా చేరింది. దీనికి తోడు కాలువల్లో పిచ్చి మొక్కలు, పెద్ద పెద్ద చెట్లు విపరీతంగా పెరిగాయి.

గౌరవెల్లి ప్రాజెక్టు పనులపై దృష్టి సారించిన మంత్రి పొన్నం

హుస్నాబాద్ ఎమ్మెల్యేగా గెలిచి, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పొన్నం ప్రభాకర్ గౌరవెల్లి ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించారు. వచ్చి రాగానే సిద్దిపేట జిల్లా కలెక్టరేట్‌లో నీటిపారుదల, రెవెన్యూ అధికారులతో గౌరవెల్లి ప్రాజెక్టుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టు కాలువలపై ఆరా తీశారు. కుడికాలువ పూర్తిగా ముళ్లపొదలు, పూడిక మట్టితో నిండిపోయిందని పలు చోట్ల కాలువకు గండ్లు పడ్డాయని అధికారులు ఆయనకు వివరించారు. అయితే ఎన్‌జీటీలో కేసు ఉండడంతో అనుమతులు త్వరలోనే వచ్చే అవకాశం ఉందని, కాలువ మరమ్మతులు చేపట్టాలని ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలతో పనులను చేయించాలని అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.

తూతూమంత్రంగా పనులు

మంత్రి ఆదేశాలతో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, డీఆర్‌డీవో జయదేవ్‌లు కుడి కాలువను పరిశీలించారు. ఉపాధి హామీ కూలీలతో పనులు ప్రారంభించాలని ఎంపీడీవో, ఏపీవోలకు సూచించారు. డిసెంబరు 25న ఉపాధి కూలీలతో పనులు ప్రారంభించి జనవరి 7 వరకు తూతూమంత్రంగా చేపట్టారు. మంత్రి ఆదేశించిన 13 రోజుల పాటు కూలీలతో పిచ్చిమొక్కలను తొలగించి ఆ తర్వాత అధికారులు చేతులు దులుపుకున్నారు. మంత్రి ఆదేశాలను సైతం అధికారులు పట్టించుకోకపోవడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మట్టి, పిచ్చిమొక్కలను తరలించేందుకు వాహనాలను ఏర్పాటు చేయలేదు

- తోడేటి ప్రభాకర్, ఉపాధి హామీ పథకం ఏపీవో, అక్కన్నపేట



కాలువల్లో తీసిన పూడిక మట్టితో పాటు తొలగించిన పిచ్చి మొక్కలు, చెట్లను తరలించేందుకు ప్రాజెక్టు అధికారులు వాహనాలు ఏర్పాటు చేయకపోవడంతో పనులను ఆపేశాం. పూడిక మట్టిని తీయడం, పెద్దపెద్దచెట్లను తొలగించడం, గండ్లు పూడ్చడానికి కూలీలతో కావడం లేదు. ఈ పనులకు వచ్చిన కూలీలు కూడా భయపడి మళ్లీ రావడం లేదు.

పదోతరగతి ఫలితాల్లో సిద్దిపేట అగ్రస్థానంలో నిలవాలి

- ఒక్క విద్యార్థి కూడా ఫెయిల్ కావొద్దు
- అందరూ చర్చించుకునేలా సిద్దిపేట అభివృద్ధి
- అభివృద్ధి అంటే జీవన ప్రమాణాలు పెరగాలి
- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు


సిద్దిపేటలోని ఎన్జీవో భవన్‌లో ఉత్తమ ఉద్యోగులను సన్మానించిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట క్రైం, జనవరి 25 : పదోతరగతి ఫలితాల్లో అదే పంథా ఉండాలని, సిద్దిపేట నియోజకవర్గం అగ్రస్థానంలో నిలవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గురువారం ఆయన సిద్దిపేట క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో పదోతరగతి పరీక్షలపై సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. పదోతరగతి ఫలితాల్లో సిద్దిపేట నియోజకవర్గం 100 శాతం ఫలితాలు సాధించాలని, ఒక్క విద్యార్థి కూడా ఫెయిల్ కావొద్దని సూచించారు. ప్రభుత్వం మారింది కానీ మనం, మన సిద్దిపేట, మన ప్రజలు.. మన పిల్లలకు మంచ చేయాలి అనేది తన నిరంతర అని ఆయన పేర్కొన్నారు. ఎప్పటిలాగానే సిద్దిపేటకు ఉన్న ప్రతిష్టను, గౌరవాన్ని కొనసాగించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు అన్ని మనమై అండగా ఉండాలని చెప్పారు. ఇప్పటి నుంచే ఫలితాలపై ప్రణాళిక తయారు చేసుకుని, ప్రత్యేక శ్రద్ధ వహించాలని హరీశ్‌రావు సూచించారు. గతేడాది సిద్దిపేట జిల్లాలో 98.65 ఉత్తీర్ణత వచ్చిందని, రాష్ట్రంలో 2వ స్థానంలో ఉన్నామని గుర్తుచేశారు. అందులో మన నియోజకవర్గం 98.67 శాతం ఉత్తీర్ణత వచ్చిందని తెలిపారు. ఈ సంవత్సరం వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. సమీక్షలో జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, నోడల్ అధికారి రామస్వామి, మండల విద్యా అధికారులు యాదవ రెడ్డి, దేశి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొన్నారు.

దేశంలో, రాష్ట్రంలో సిద్దిపేటకు గుర్తింపు

సిద్దిపేట టౌన్, జనవరి 25: దేశంలో, రాష్ట్రంలో సిద్దిపేట అభివృద్ధిపై అందరూ చర్చించుకునేలా చేసుకున్నామని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గురువారం సాయంత్రం సిద్దిపేటలోని ఎన్జీవో భవన్‌లో జిల్లాలోని పలు ప్రభుత్వశాఖలో పనిచేస్తున్న ఉత్తమ ఉద్యోగులను టీఎన్‌జీవో ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొని ఉత్తమ ఉద్యోగులను సన్మానించి మాట్లాడారు. సిద్దిపేటలోని ఎన్జీవో భవన్‌తో 20 ఏళ్ల ఆత్మీయ అనుబంధం ఉందన్నారు. ఉత్తమ ఉద్యోగుల సన్మాన కార్యక్రమం ప్రతి ఏడాది పండుగలా నిర్వహించుకున్నామని తెలిపారు. ఈ ఏడాది కూడా అవార్డులు అందుకుంటున్న ఉత్తమ ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. ప్రజాసేవ చేసే వారిని సమాజం కూడా గుర్తిస్తే, ఆ గౌరవం మాటల్లో వెలకట్టలేనిదని, దాని ద్వారా రెట్టింపుతో పని చేస్తారని తెలిపారు. ఐదు


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

రాష్ట్రాలతో పోటీపడి, దక్షిణ భారతదేశంలోనే క్లీనెస్ట్ అవార్డును సిద్దిపేట మున్సిపల్ సాధించిందన్నారు. అభివృద్ధి అంటే రోడ్లు, భవనాలు కడితే కాదని, ప్రజల జీవన ప్రమాణాలు పెరిగి, ఆరోగ్యంగా ఉం డేలా చూడడమని వివరించారు. జాతీయస్థాయిలో సిద్దిపేటకు 37 అవార్డులు రావడంలో ప్రజల భాగస్వామ్యం, కార్మికుల కృషితోనే సాధ్యమైందని చెప్పారు. క్యాన్సర్ లాంటి వ్యాధులను నయం చేసే చికిత్స ఇంకా అందుబాటులోకి రాలేదని, ఆ వ్యాధిని జయించాలంటే యోగాలోని ప్రాణాయామంలోనే ఉందని మాజీ మంత్రి పేర్కొన్నారు. సిద్దిపేట ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు పట్టణంలోని నలువైపులా వాకింగ్ ట్రాక్‌లు, యోగా చేసుకునేందుకు మైదానాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలందరూ వినియోగించుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. సిద్దిపేట ప్రజల్లో స్వచ్ఛతపై భారీ మార్పు వచ్చిందని, రోడ్డుపై చెత్త, చెదారం పడేయకుండా డస్ట్ బిన్‌లో వేస్తూ, సిద్దిపేట అభివృద్ధికి సహకరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, కౌన్సిలర్ సాయి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, టీఎన్జీవో నాయకులు గ్యాదరి పరమేశ్వర్, విక్రమ్‌రెడ్డి, కాల్వ చక్రధర్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

45 రోజులు.. రూ.1.39 కోట్లు

- మల్లన్న ఆలయంలో హుండీ లెక్కింపు
- రికార్డుస్థాయిలో ఆదాయం

7 లో

ఎమ్మెల్యేగా ఓడినా రఘునందన్‌కు జ్ఞానోదయం కాలేదు

- ఇష్టారీతిగా మాట్లాడితే సహించేది లేదు
- కాంగ్రెస్ నేతలకు మాటలు తప్ప చేతలు లేవు
- అభివృద్ధి పనుల కోసం సీఎంను కలిస్తే తప్పేంటి
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ధ్వజం


ఓటు ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, అధికారులు

ప్రజాస్వామ్యానికి పునాది ఓటు

- అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

సిద్దిపేటటౌన్, జనవరి 25: ప్రజాస్వామ్యానికి పునాది ఓటు అని, మహిళలు, పురుషులు, ధనికులు, పేదవారు ఎవరు ఏ స్థాయిలో ఉన్నా ఓటు విలువ సమానంగా ఉంటుందని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ అన్నారు. గురువారం సిద్దిపేటలోని ఓ గార్డెన్‌లో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో 14వ జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ హాజరై ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. నూతన ఓటర్లకు ఎపిక్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం సీనియర్ సిటిజన్స్‌ను సన్మానించారు. అనంతరం శాసనసభ ఎన్నికల శిక్షణలో పాలుపంచుకున్న జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లకు సర్టిఫికెట్లను అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఓటు ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఓటు ముందు అందరం సమానమేని, ప్రభుత్వాలను మార్చే శక్తి ఓటుకే ఉందన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటు వేయాలని సూచించారు. మీ ఓటు మీ బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన ఓటర్లను, దేశంలో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసిన సీనియర్ సిటీజన్లను సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. నవంబరులోజరిగిన శాసనసభ ఎన్నికల్లో అందరూ పాల్గొని విజయవంతం చేశారని, ఎన్నికలంటే ఓటర్లు, పోటీ చేసే అభ్యర్థులే కాదని, ఆ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించిన అధికారులు కూడా ముఖ్యమైనవారేనని తెలిపారు. ఎన్నికల సీఈవో నుంచి బూత్ లెవెల్ అధికారులైన అంగన్‌వాడీల వరకు


ఓటు ప్రతిజ్ఞ చేస్తున్న ఓటర్లు

ప్రతి ఒక్కరూ ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వహిస్తారన్నారు. జిల్లాలోని ఎన్నికల మాస్టర్ ట్రైనర్లు ట్రైనింగ్ ప్రోగ్రాంలతో పాటు ఎన్నికల ప్రక్రియలో పాల్గొని విజయవంతం చేసినవారందికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఆర్డీవో రమేష్‌బాబు, అర్బన్ తహసీల్దార్ దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, బీఎల్‌వోలు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ కస్తూర్బా విద్యార్థినులకు రాష్ట్రస్థాయి మొదటి బహుమతి

- ఓటు ప్రాధాన్యతపై వ్యాసరచన పోటీలు
- బహుమతి అందజేసిన గవర్నర్



గవర్నర్ నుంచి బహుమతి అందుకుంటున్నవిద్యార్థినులు

నర్సాపూర్, జనవరి 25: జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన పోటీలలో రాష్ట్ర స్థాయిలోనే నర్సాపూర్ మండలం చిప్పల్‌తుర్తి సమీపంలోని కస్తుర్బ విద్యాలయం ఇంటర్ విద్యార్థులు మొదటి బహుమతిని గవర్నర్ తమిళసై చేతుల మీదుగా అందుకున్నారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ తమిళసై మొదటి బహుమతిని నర్సాపూర్ కస్తుర్బ విద్యార్థులకు బహుమతి అందచేసినట్లు స్పెషల్ ఆఫీసర్ స్వేత పేర్కొన్నారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఓటు విలువ దాని ఆవశ్యకతపై నిర్వహించిన పోటీలో ప్రతిభ చూపి మొదటి బహుమతి దక్కించుకుని గవర్నర్ చేతుల మీదుగా అందుకున్నందుకు చాలా ఆనందంగా ఉందని చెప్పారు.

మీరు ప్రయత్నిస్తున్న నంబరు అందుబాటులో లేదు!!

- మల్లన్న చెంత సిగ్నల్స్ చింత
- జాతర వస్తే చాలు మూగబోతున్న సెల్‌ఫోన్లు

చేర్యాల, జనవరి 25: ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా జాతరవారం వచ్చిందటే చాలు సెల్‌ఫోన్లు మూగబోతున్నాయి. ప్రతీవారం భక్తులు భారీగా తరలివస్తున్న నేపథ్యంలో సెల్‌ఫోన్ సిగ్నల్స్ సరిగా ఉండక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాకేంద్రంతో పాటు జాతీయ రహదారికి అతి సమీపంలో ఉన్న కొమురవెల్లిలో సెల్ సిగ్నల్స్ సక్రమంగా పని చేయకపోవడంతో భక్తులు ఉసూరుమంటున్నారు. ప్రతి సంవత్సరం మూడునెలల పాటు జరిగే బ్రహ్మోత్సవాలకు తెలంగాణ, ఆంధ్రా, ఛత్తీస్‌ఘడ్, ఒరిస్సా, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. అయితే ఇక్కడ అన్ని రకాల సెల్‌నెట్‌వర్క్‌లు దాదాపుగా అందుబాటులో ఉన్నప్పటికీ జాతర సమయంలో భక్తుల రద్దీ వల్ల ఫ్రీక్వెన్సీ తగ్గి ఫోన్‌లు చేస్తే కలవని పరిస్థితి. ఫలితంగా భక్తులకు సరైన సమాచారం తెలియక ఆందోళనకు గురవుతున్నారు. అంతేకాకుండా అధికారుల పర్యవేక్షణ, సమన్వయం కొరవడుతుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సాధారణంగా ఒకసారి డయల్ చేయడంతోనే కనెక్ట్ అవుతుంది. జాతర సమయంలో మాత్రం ఓ పదిసార్లు ప్రయత్నిస్తే కానీ కనెక్ట్ కాదు. ఒకవేళ కనెక్ట్ అయినా వాయిస్ సరిగా వినపడదు. ప్రతి ఏటా సమీక్షా సమావేశాల్లో సెల్‌సిగ్నల్స్ గురించి ప్రస్తావిస్తారు. మొబైల్ టవర్స్ ఏర్పాటు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని చెబుతున్నా ఆచరణలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో భక్తులు ఫోన్ చేసుకోవాలంటే పొరుగు గ్రామానికి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. కొందరు సిగ్నల్స్ కోసం కొండలు, గుట్టలు, భవనాల పైకి ఎక్కి ఫోన్ మాట్లాడే క్రమంలో ప్రమాదాలబారిన పడే అవకాశం లేకపోలేదు. జాతరలో ఎవరన్న తప్పిపోయి తమ కుటుంబీల కోసం ఫోన్ చేస్తే కలవక ఆందోళనకు గురవుతున్నారు. ఇక ఇటీవల పట్నంవారం సందర్భంగా లక్షకుపైగా ఒక్కసారిగా భక్తులు తరలిరావడంతో ఏ మాత్రం పనిచేయకపోవడంతో ఆలయ వర్గాలు, భక్తులు నానాతంటాలు ఎదుర్కొన్నారు. మరో 11వారాల పాటు జాతర కొనసాగనుండగా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.


సిగ్నల్స్ రాక భవనం పైకి ఎక్కి ఫోన్ మాట్లాడుతున్న యువతి


జాతరవారం రోజున ఆలయ పరిసరాల్లో భక్తుల రద్దీ


మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ అనురాధ

మంచోళ్లకే ఫ్రెండ్లీ పోలీసింగ్

- అక్రమాలను ఇక సాగనివ్వను
- డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం
- శాంతిభద్రతలతోనే ప్రగతి సాధ్యం
- సిద్దిపేట సీపీ డాక్టర్ అనురాధ

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జనవరి 25: మంచివాళ్లకు మాత్రమే ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉంటుందే తప్ప నేరస్థులకు, అక్రమార్కులకు కాదని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ స్పష్టం చేశారు. యువత జీవితాలను నాశనం చేస్తున్న డ్రగ్స్, గంజాయి అమ్మకాలపై ఉక్కుపాదం తప్పదని హెచ్చరించారు. డ్రగ్స్ ఫ్రీ కమిషనరేట్‌గా సిద్దిపేట జిల్లాను తీర్చిదిద్దుతామని ఆమె ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఆమె విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ఇసుక, రేషన్ బియ్యం అక్రమ రవాణాపై తన దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇకపై అక్రమ దందాలను కొనసాగనిచ్చేది లేదని తేల్చిచెప్పారు. అక్రమాలు, అసాంఘిక కార్యకలాపాలపై ఏదైనా సమాచారం తెలిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఫిర్యాదులు చేస్తే తక్షణమే స్పందించే విధంగా పోలీసు యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఎంతటివారికైనా శిక్ష తప్పదని హెచ్చరించారు. అత్యాశ, దురాశ వల్లే సైబర్ నేరాలు అధికమవుతున్నాయని, ఈ విషయంపై ప్రజల్లో క్షేత్రస్థాయి అవగాహన కల్పిస్తామని అనురాధ పేర్కొన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడిపేలా అవగాహన కల్పించాలని సూచించారు. సీఈఐఆర్ అనే పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్‌ను తిరిగిపొందవచ్చని చెప్పారు. పోగొట్టుకున్నా, దొంగతనానికి గురైనా వెంటనే ఈ పోర్టల్‌ను సంప్రదిస్తే ఫలితం ఉంటుందని సీపీ స్పష్టం చేశారు. శాంతిభద్రతల వల్లనే ప్రగతి సాధ్యమవుతుందని, శాంతిభద్రతలు సక్రమంగా ఉంటేనే అన్ని రంగాలూ విస్తరిస్తాయని సీపీ పేర్కొన్నారు.

డాక్టర్ టు కమిషనర్

వెటర్నరీ డాక్టర్‌గా విద్యనభ్యసించిన అనురాధ పోలీస్ కమిషనర్ స్థాయికి అంచలంచెలుగా ఎదిగారు. 2001లో గ్రూప్-1 ద్వారా డీఎస్పీగా ఎంపికై 2017లో ఐపీఎస్ హోదాను పొందారు. వరంగల్ కమిషనరేట్ డీసీపీగా, మహబూబ్‌నగర్ ఎస్పీగా, రైల్వేస్ ఎస్పీగా విధులు నిర్వహించారు. సుదీర్ఘకాలం పాటు సైబర్‌క్రైమ్స్ విభాగంలో డీసీపీగా పనిచేసిన అనుభవం ఉంది. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లో నియంత్రణలో కీలకంగా వ్యవహరించారు.

దేశంలో శక్తివంతమైన ప్రజాస్వామ్యం

● నల్సార్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు

పటాన్‌చెరు రూరల్, జనవరి 25 : మనది శక్తివంతమైన ప్రజాస్వామ్య దేశమని, చట్టబద్ధ పాలన, రాజ్యాంగ ఆధిపత్యం, నిష్పాక్షికత, అందుబాటులో ఉండే న్యాయవ్యవస్థ వంటి ప్రధాన స్తంభాలపై నిలిచిన రాజ్యాంగం సొంతమని నల్సార్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు చెప్పారు. గణతంత్ర దినోత్సవంలో భాగంగా 'రాజ్యాంగం - సామాన్యుడిపై దాని ప్రభావం' అనే అంశంపై గురువారం ఆయన గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ కార్యక్రమంలో అతిథ్య ఉపన్యాసం చేశారు. రాజ్యాంగాన్ని ప్రతీ పౌరుడూ చదవాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు. ముందుగా రాజ్యాంగాన్ని ఆకలింపు చేసుకుని, అందులో పొందుపరచిన ప్రాథమిక హక్కులు, నిర్దేశక సూత్రాలను అర్థం చేసుకుని ఒక అభిప్రాయానికి రావొచ్చని ప్రొఫెసర్ రావు సూచించారు. ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పీఐఎల్) ప్రాముఖ్యతను వివరించారు. రాజ్యాంగం ఏడు ఆలోచనలు, లక్ష్యాలు, రూపకల్పన, ప్రవేశిక, ప్రాథమిక హక్కులు, విధులు, మార్పుల గురించి విడమరిచి చెప్పారు. రాజ్యాంగం సజీవ పత్రమని, స్వాతంత్ర్య పోరాట విలువలను ప్రతిబింబిస్తూ న్యాయమైన, స్వేచ్ఛాయుత సమాజాన్ని సృష్టించేందుకు కృషి చేస్తోందన్నారు. కేశవానంద భారతి, మేనకా గాంధీ, అయోధ్య తీర్పు వంటి పలు మైలురాళ్ల వంటి కేసులను ఉటంకించారు. గీతం గ్రంథాలయానికి రాజ్యాంగ ప్రతులను ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు విరాళంగా ఇచ్చారు. పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జీఎస్‌హెచ్‌ఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సన్నీ జీ.జోస్ స్వాగతోపన్యాసం చేశారు.


మాట్లాడుతున్న ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు

వీరభద్రస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో చండీ హోమం


బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయంలో చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు, ఆలయ సిబ్బంది

గుమ్మడిదల, జనవరి 25 : గుమ్మడిదల మండలం బొంతపల్లి వీరన్నగూడెం వీరభద్రస్వామి ఆలయంలో గురువారం చండీ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతీ నెల పౌర్ణమి రోజు ఆలయ ఆవరణలో చండీహోమం నిర్వహించి వీరభద్రస్వామి, భద్రకాళి అమ్మవారి అనుగ్రహాన్ని పొందుతారు. వేద పండితులు మంత్రోచ్ఛరణాల మధ్య హోమాన్ని ఘనంగా నిర్వహించారు. పాల్గొన్న భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ సీనియర్ పర్యవేక్షకులు సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి ఆలయంలో మాధవానందస్వామి పూజలు

నర్సాపూర్, జనవరి 25: నర్సాపూర్ మండలం గొల్లపల్లిలోని కేతకీభ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన పూజ కార్యక్రమంలో మాధవానందస్వామి పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా విశేష పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ వాల్దాస్‌మల్లేశ్‌గౌడ్ దంపతులతో పాటు పలువురు పాల్గొన్నారు.

చిన్నగొట్టిముక్కలో దుర్గమ్మ జాతర

శివ్వంపేట, జనవరి 25: మండలంలోని చిన్నగొట్టిముక్క గ్రామంలో దుర్గమ్మ జాతర సందర్భంగా గురువారం ఊరడమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాలమణినరేందర్, ఎంపీటీసీ దశరథ్, నాయకులు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ తయారీ ముడిసరుకు స్వాధీనం

- నందికంది దాబాలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడి
- పాపి స్ట్రా పౌడర్‌ను విక్రయిస్తుండగా ఇద్దరి అరెస్టు
- నిందితులు రాజస్థాన్ రాష్ట్రానికి చెందినవారు



స్వాధీనం చేసుకున్న పౌడర్‌ను, నిందితులను చూపుతున్న పోలీసులు

సదాశివపేట, జనవరి 25 : సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నందికంది గ్రామ శివారులోని ఓ దాబా హోటల్‌లో బుధవారం ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించి రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి డ్రగ్స్ తయారీ ముడి సరకును స్వాధీనం చేసుకున్నారు. ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మెదక్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ కె.శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. నమ్మదగిన సమాచారం మేరకు నందికంది గ్రామ సమీపంలోని రామ్‌దేవ్ రాజస్థాన్ దాబా హోటల్‌లో బుధవారం దాడి చేశారు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ములారామ్, జగ్‌జీవన్ సాయంత్రం 5 గంటల సమయంలో రూ.లక్ష విలువ చేసే 210 గ్రాముల పాపి స్ట్రా పౌడర్‌ను విక్రయిస్తుండగా నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా హెరాయిన్ డ్రగ్స్ తయారీలో ఉపయోగించే పాపి స్ట్రా పౌడర్‌ను రాజస్థాన్ నుంచి తీసుకువచ్చి విక్రయిస్తున్నట్టు అంగీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు కె.శ్రీనివాస్‌రావు తెలిపారు.

నార్సింగిలో తేనెటీగల దాడి

- 20 మందికిపైగా గాయాలు



గాయపడిన బాలుడిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

మాసాయిపేట, జనవరి 25 : తేనెటీగల గుంపు దాడి చేయడంతో 20 మందికి పైగా గాయాలైన ఘటన గురువారం నార్సింగి మండల కేంద్రంలోని రైతువేదిక ఆవరణలో చోటుచేసుకున్నది. మండల కేంద్రంలోని రైతువేదిక సమీపంలో ఓ చెట్టుపైన ఉన్న తేనెతుట్ట ఉంది. ఆ చెట్లపై కోతులు దూకుతూ కొమ్మలపై వేలాడుతుండగా తేనెతుట్టెకు తగిలాయి. దీంతో ఒక్కసారిగా తేనేటీగల గుంపు లేచి అక్కడ ఉన్న వారిపై దాడి చేశాయి. చెట్ల కింద కూర్చున్న వారిపై, ఆ ప్రాంతంలో నుంచి వెళ్తున్న బాటసారులను కుట్టాయి. నార్సింగి వడ్డెర కాలనీకి చెందిన కొంత మంది ఒక పంచాయితీ విషయమై చెట్ల వద్ద కూర్చుని మాట్లాడుతుండగా ఈ ఘటన చోటుచేసుకున్నది. సుమారు 20మంది వరకు గాయపడ్డారు. అంతేకాకుండా పాఠశాల నుంచి మధ్యాహ్న భోజనం కోసం వసతిగృహానికి వెళ్తున్న హాస్టల్ విద్యార్థులు కూడా గాయపడ్డారు. వీరిలో రామచంద్రం, లింగయ్య, నారాయణ తీవ్రంగా గాయపడగా మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

ఎమ్మెల్యేగా ఓడినా రఘునందన్‌కు జ్ఞానోదయం కాలేదు

- ఇష్టారీతిగా మాట్లాడితే సహించేది లేదు
- కాంగ్రెస్ నేతలకు మాటలు తప్ప చేతలు లేవు
- అభివృద్ధి పనుల కోసం సీఎంను కలిస్తే తప్పేంటి
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ధ్వజం

తొగుట, జనవరి 25 : అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాకలో ఓటమి పాలైనా రఘునందన్‌రావుకు జ్ఞానోదయం కాలేదని, ఇష్టారీతిగా మాట్లాడితే సహించేది లేదని దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని పలు గ్రామాల్లో గురువారం కొత్త ప్రభాకర్‌రెడ్డి అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో, రాష్ట్ర అభివృద్ధిలో కీలక భూమిక పోషించిన ఓటమి ఎరుగని నేత హరీశ్‌రావు అని, ఆయనపై రఘునందన్‌రావు ప్రేలాపణలు సిగ్గుచేటన్నారు. దుబ్బాక ఉపఎన్నికల్లో అత్తెసరు ఓట్లతో గెలిచిన ఆయన నాడు ఇచ్చిన ఒక హామీనైనా నెరవేర్చారా అని ప్రశ్నించారు. తాను సీఎంను కలవడమే పాపం అన్నట్లు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. సీఎం కాంగ్రెస్ పార్టీకా.. లేక రాష్ట్రానికా అనేది తెల్వకపోవడం దౌర్భాగ్యం అన్నారు.



జప్తిలింగారెడ్డిపల్లిలో పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న కొత్త ప్రభాకర్

ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడం కోసం ఎమ్మెల్యేగా ప్రభుత్వంలో ఉన్న మంత్రులను కలిస్తే తప్పేంటి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి భారత ప్రధాని నరేంద్రమోదీని కలిస్తే అపుడు నోళ్లు ఎందుకు మూసుకుపోయాయని రఘునందన్‌రావుపై మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలవి మాటలు తప్ప చేతలు ఏమి లేవని ఎద్దేవా చేశారు. గతంలో రైతులు మంత్రికి ఒక్కఫోన్ కాల్ చేస్తే మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలను కూడవెల్లి వాగులోకి విడిచిపెట్టే వారని చెప్పారు. ఇపుడు స్వయంగా మంత్రులను కలిసి విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడం చూస్తే వారికి రైతుల పట్ల ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం భేషజాలకు పోకుండా రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోకుండా మల్లన్నసాగర్ నుంచి సాగునీటిని విడుదల చేయాలని కొత్త ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిని ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించి కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయమని జోస్యం చెప్పారు. అంతకు ముందు మల్లన్నసాగర్ నుంచి దుబ్బాకకు సాగునీరు వెళ్లే ప్రధాన కాలువ వద్దకు చేరుకుని పరిశీలించారు. అనంతరం మండలంలోని జప్తిలింగారెడ్డిపల్లి, పెద్ద మాసాన్‌పల్లి, ఎల్లారెడ్డిపేట, వర్దరాజ్‌పల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ, రైతువేదిక భవనాలను ప్రారంభించారు. వివిధ గ్రామాల్లో ఎస్సీ కమ్యూనిటీహాల్, గౌడ సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వెంకటయ్య, మండల అధ్యక్షుడు రాంరెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ హరికృష్ణారెడ్డి, సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు చిలివేరి జ్యోతి మల్లారెడ్డి, చత్రి కనకవ్వ, మల్లయ్య, నాయకులు స్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మోతీమాతా.. దీవించమ్మా

- అంగరంగ వైభవంగా మరిగమ్మ జాతర
- చివరి రోజు ఉత్సవాలకు తండోపతండాలుగా తరలివచ్చిన భక్తులు



ఉప్పర్‌తండా మోతీమోత జాతరలో జనసందోహం

జహీరాబాద్, జనవరి 25 : మమ్మేలు మాఅమ్మా.. మరిగమ్మ మోతీమాతా.. దీవించమ్మా అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలంలోని ఉప్పర్‌తండాలో రెండు రోజులపాటు నిర్వహించిన మోతీమాత జాతర ఉత్సవాలు అంగరంగవైభవంగా కొనసాగాయి. గురువారం జాతర చివరి రోజు కావడంతో మోతీమాతను దర్శించుకోవడానికి జిల్లాతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. రెండుకిలోమీటర్ల మేర భక్తులు టెంట్లను ఏర్పాటు చేసుకుని అమ్మవారికి నైవేద్యాలను సమర్పించారు. ప్రముఖులు మరిగమ్మ మోతీమాతను దర్శించుకుకోవడానికి తరలివచ్చారు. మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, నేతలు నరోత్తం, తన్వీర్, జైపాల్‌రెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. అడవిబిడ్డల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే మాణిక్‌రావు కోరుకున్నారు. బీఎస్ఎన్ఎల్ డైరెక్టర్ శంకర్‌నాయక్ ఆలయాభివృద్ధికి రూ.10లక్షలు ఇవ్వాలని ఎంపీ బీబీపాటిల్‌ను కోరగా వెంటనే మంజూరు చేస్తానని హామీఇచ్చారు. అలాగే జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు కూడా తనవంతు బాధ్యతతో రూ.5 లక్షలను ఇస్తానని హామీ ఇచ్చారు. గిరిజనుల గురువైన గోవింద్‌హరాజ్‌ను ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఆలయ ఉత్సవకమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

జాతీయ రహదారి వెంట అక్రమ నిర్మాణాలు

- ప్రభుత్వం నుంచి నష్టపరిహారం కోసం జిమ్మిక్కులు
- రోడ్ల విస్తరణకు గ్రీన్‌సిగ్నల్‌తో అక్రమార్కుల వక్రబుద్ధి
- మున్సిపల్ నుంచి దొడ్డిదారిన ఇంటి నంబర్లు



పోతిరెడ్డిపల్లి, కంది శివారులో జాతీయ రహదారి పక్కనే అక్రమ నిర్మాణాలు

సంగారెడ్డి టౌన్, జనవరి 25 : భూముల ధరలు ఆకాశాన్నంటుతుండడంతో కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. జాతీయరహదారి విస్తరణలో నష్టపరిహారం కోసం జిమ్మిక్కులు చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో జాతీయరహదారికి ఇరువైపులా అక్రమ నిర్మాణాలు చేపట్టి అద్దెకు ఇస్తున్నారు. దీంతో లక్షలాది రూపాయల విలువైన భూములు కబ్జా కావడమేగాక రోడ్లు కుదించుకుపోయి ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

65వ నంబరు జాతీయరహదారికి ఇరువైపులా ..

జాతీయరహదారికి ఇరువైపులా ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జాదారులు వాటిపై కన్నేసి నిర్మాణాలు చేపడుతున్నారు. సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డిపల్లి-కంది, మల్కాపూర్ మధ్య ఉన్న 65వ నంబరు జాతీయరహదారికి ఇరువైపులా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఈ రహదారిని ఆరులేన్లుగా విస్తరించేందుకు నేషనల్ హైవే అథారిటీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఏవైనా నిర్మాణాలుంటే వాటిని గుర్తించి నష్టపరిహారం ఇవ్వాలని ఎన్‌హెచ్ఏ ఉత్తర్వులు ఇచ్చింది. దీనిని ఆసరాగా చేసుకొని కొంతమంది పోతిరెడ్డిపల్లి - కంది - మల్కాపూర్ మధ్య ఉన్న జాతీయ రహదారికి ఇరువైపులా చిన్నచిన్న దుకాణాలను అక్రమంగా నిర్మించి అద్దెకు ఇచ్చారు. మున్సిపాలిటీలో ఇంటి నంబర్లతో పాటు ట్రాన్స్‌కో నుంచి కరెంట్ మీటర్లు సైతం పొందారు. చిరు వ్యాపారులకు అద్దెకు ఇచ్చి జేబులు నింపుకుంటున్నారు. రోడ్డుకు పక్కన ఉన్న మిషన్ భగీరథ పైపులైన్లను సైతం ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయంపై పలువురు మున్సిపల్, రెవెన్యూ, ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

కలెక్టర్ విచారణ చేపట్టాలి

జిల్లాలో ప్రభుత్వ భూములను రక్షించాలని, జాతీయ రహదారికి ఇరువైపులా చేపట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని పలువురు పట్టణ ప్రజలు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆరు నెలల నుంచి 65వ జాతీయ రహదారిపై అక్రమ నిర్మాణాలు చేపట్టి అద్దెకు ఇస్తున్న దందా కొనసాగుతోందని, ఇప్పటివరకు ఏ అధికారి పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు మున్సిపల్ అధికారులు ఏ విధంగా ఇంటి నంబర్లు కేటాయించారో? ట్రాన్స్‌కో అధికారులు కరెంట్ మీటర్లు ఎలా ఇచ్చారో విచారణ జరపాలని పలువురు కలెక్టర్‌ను కోరుతున్నారు.

పార్కులకు గ్రహణం

- సిద్దిపేటలో పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- అన్యాక్రాంతమవుతున్న పార్కు స్థలాలు

సిద్దిపేట టౌన్, జనవరి 25 : సిద్దిపేట పట్టణంలో పలు పార్కులు పర్యాటకులకు ఆహ్లాదానివ్వలేకపోతున్నాయి. పట్టణవాసులు కాసేపు ఉపశమనం పొందేందుకు పార్కులకు వెళ్దామనుకుంటే మూసి ఉంటున్నాయి. సిద్దిపేటలో ఐదు పార్కులుండగా రెండు మినహా ఏ పార్కులోనూ వసతులు లేకపోవడం, ఇతరత్రా కారణాలతో ఎల్లప్పుడూ మూసే ఉంటున్నాయి.

పార్కు గేట్లకు తాళం

సిద్దిపేట పట్టణంలో ఐదు పార్కులు ఉండగా వీటిలో పట్టణంలోని నడిబొడ్డున మైత్రివనం, హౌజింగ్‌బోర్డు కమాన్ వద్ద ఉన్న పార్కులు మినహా అందుబాటులో ఉంచడం లేదు. విక్టరీ థియేటర్ వద్ద మహాత్మ గాంధీపార్కు, మంగమ్మతోట పార్కు గేట్లకు తాళాలే దర్శనమిస్తున్నాయి. కొన్నేళ్ల క్రితం సిద్దిపేట పట్టణంలో శిథిలావస్థకు చేరడంతో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచన మేరకు మున్సిపల్ పాలకవర్గం, అధికారులు లక్షలాది రూపాయలు వెచ్చించి మహాత్మగాంధీ పార్కుగా నామకరణం చేసి అద్భుతంగా తీర్చిదిద్దారు. కొన్నాళ్ల నుంచి పార్కును మూసే ఉంటుంది. చూట్టూ పచ్చని చెట్లతో ఆహ్లాదకరంగా ఉన్న మహాత్మ గాంధీ పార్కు మూసివేయడంతో వ్యాయామదారులు, వాకర్లు మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్నారు. పార్కులో ఏమైనా సమస్యలుంటే వాటిని మరమతు చేయించి పునఃప్రారంభించాలని కోరుతున్నారు.



సిద్దిపేట పట్టణంలో మూసి ఉన్న మహాత్మ గాంధీ పార్కు



కబ్జాకు గురైన చిల్డ్రన్స్ పార్కు స్థలంలో ప్రహరీని కూల్చిన మున్సిపల్ సిబ్బంది

మహాత్మ గాంధీ పార్కు స్థలం కబ్జాకు యత్నం

మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పార్కు స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయి. మహాత్మ గాంధీ పార్కుతో పాటు, పక్కనే పలు పరికరాలతో చిల్డ్రన్ పార్కును గతంలోనే ఏర్పాటు చేశారు. మహాత్మ గాంధీ పార్కు మూసివేయడంతో గుర్తుతెలియని వ్యక్తులు రాత్రికిరాత్రే కబ్జా చేసే ప్రయత్నం చేశారు. కొన్ని రోజుల క్రితం సోషల్ మీడియా ద్వారా మున్సిపల్ అధికారుల దృష్టికి వెళ్లడంతో స్పందించి వాటిని కూల్చివేశారు.

45 రోజులు.. రూ.1.39 కోట్లు

- కొమురవెల్లి మల్లన్న ఆలయంలో హుండీ లెక్కింపు
- రికార్డుస్థాయిలో సమకూరిన ఆదాయం
- రెండేళ్ల కిత్రం రూ.1.28 కోట్లు



హుండీలో లభ్యమైన కోరమీసం

చేర్యాల, జనవరి 25 : కొమురవెల్లి మల్లన్న కానుకల హుండీలలో కాసుల గలగల పారింది. ఆలయ చరిత్రలో లేని విధంగా రికార్డుస్థాయిలో ఆదాయం సమకూరింది. ఈ మేరకు ఆలయంలో గురువారం ముఖమండపంలో ఈవో బాలాజీ శర్మ ఆధ్వర్యంలో సత్యసాయి మహిళా సేవా సమితి సభ్యులు కానుకలు, ఒడిబియ్యం లెక్కింపు చేపట్టారు. ఉదయం ప్రారంభించిన కరెన్సీ లెక్కింపు రాత్రి వరకు కొనసాగగా రూ.1,39,77,230 నగదు, 68గ్రాముల బంగారం, 14.80 కిలోల వెండి, 25 క్వింటాళ్ల బియ్యం, విదేశీ కరెన్సీనోట్లు 15 లభ్యమయ్యాయి. ఈనెల7న నిర్వహించిన స్వామి వారి కల్యాణంతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలతో పాటు మేడారం సమ్మక్క- సారలమ్మను దర్శించుకున్న భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. ఇటీవల పట్నం వారానికి లక్షమందికిపైగా భక్తులు చేరుకుని దండిగా కానుకలు సమర్పించడంతో హుండీలు నిండిపోయాయి. 45 రోజుల్లోనే రికార్డుస్థాయిలో ఆదాయం సమకూరింది. గతంలో అత్యధికంగా రెండేళ్ల క్రితం రూ.1.28 కోట్లు ఆదాయం రాగా, ఈఏడాది అంతకుమించి ఆదాయం సమకూరింది.



హుండీలోని విదేశీ కరెన్సీ

ఖేలో ఇండియా సౌత్ జోన్ యోగా పోటీలకు గజ్వేల్ విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థినులు అంకిత, వైష్ణవి

గజ్వేల్, జనవరి 25: ఖేలో ఇండియా సౌత్ జోన్ జాతీయ యోగా పోటీలకు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారని కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీఈటీ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. క్రీడాకారిణీలు ఎం.అంకిత, ఎస్.వైష్ణవి ఎంపికయ్యారని, 27, 28 తేదీల్లో తమిళనాడు రాష్ట్రం దిండుగల్‌లోని పీఎస్ఎన్ఏ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో జరిగే ఖేలో ఇండియా సౌత్ జోన్ ఉమెన్స్ యోగా పోటీల్లో పాల్గొంటారని పీఈటీ పేర్కొన్నారు. వారిని ఉపాధ్యాయులు అభినందించారు.

తొలి రోజే సగం మందికి రక్తహీనత నిర్ధారణ

- వెయ్యి మందికిపైగా పరీక్షలు
- సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా తొమ్మిది బృందాలతో స్ర్కీనింగ్

సంగారెడ్డి అర్బన్, జనవరి 25 : విద్యార్థుల్లో రక్తహీనత సమస్యలు ఉత్పన్నమౌతున్నాయి. 'ఎనీమియా ముక్త్ తెలంగాణ' కార్యక్రమం కింద చేపట్టిన స్ర్కీనింగ్ ద్వారా ఈ విషయం స్పష్టమవుతున్నది. వైద్య ఆరోగ్య శాఖ 'ఎనీమియా ముక్త్ తెలంగాణ' పేరిట శ్రీకారం చుట్టిన కార్యక్రమాన్ని సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం శివంపేటలో బుధవారం మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించిన విషయం తెలిసిందే. తొలిరోజు 1,083 మందికి స్ర్కీనింగ్ చేయగా 580 మంది రక్తహీనతతో బాధపడుతున్నట్టు తేలింది.

మార్చి 15 వరకు కొనసాగనున్న స్ర్కీనింగ్

సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 249 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని 8, 9, 10 వ తరగతి, 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని ఫస్ట్, సెకండియర్ విద్యార్థులకు ఉచితంగా రక్తహీనత నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. మార్చి 15వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగనున్నది. వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కె)కు చెందిన తొమ్మిది వైద్య బృందాలు పరీక్షలను నిర్వహిస్తాయి. జిల్లావ్యాప్తంగా 57,478 మంది విద్యార్థులకు రక్తహీనత నిర్ధారణ పరీక్షలు చేయాలనే లక్ష్యంగా నిర్దేశించారు. ఇందులో బాలికలు 32,153 మంది ఉండగా, బాలురు 25,325 మంది ఉన్నారు. ప్రతీ బృందంలో ఒక మేల్, ఒక ఫిమేల్ మెడికల్ ఆఫీసర్, ఏఎన్ఎం, ఫార్మసిస్టు ఉంటారు. నిత్యం సుమారు 100-200 మందికి పరీక్షలు చేస్తారు. వైద్య ఆరోగ్య శాఖ ఆర్‌బీఎస్‌కే బృందాలు హిమోగ్లోబిన్ శాతాన్ని పరీక్షించి 12 శాతం కన్నా హిమోగ్లోబిన్ తక్కువగా ఉంటే అప్పటికప్పుడు ఐరన్ మాత్రలు పంపిణీ చేస్తున్నారు. అంతే కాకుండా పోషకాహారంతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని పిల్లలకు సూచనలు ఇస్తున్నారు.



సంగారెడ్డిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రక్తహీనత పరీక్షలు చేస్తున్న ఆర్‌బీఎస్‌కే వైద్య సిబ్బంది

580 మందికి రక్తహీనత

స్ర్కీనింగ్ కార్యక్రమం ద్వారా తొలి రోజు 1083 మందికి స్ర్కీనింగ్ చేశారు. ఇందులో హిమోగ్లోబిన్ 8 గ్రాముల కంటే తక్కువగా ఉంటే తీవ్రంగా పరిగణిస్తారు. 8-10.9 శాతం ఉన్న వారిని మధ్యమంగా, 11 నంచి 11.9 శాతం ఉంటే తేలికపాటి(మైల్డ్)గా పరిగణిస్తారు. 12 శాతంపైగా ఉంటే సాధారణంగా గుర్తిస్తారు. ఈ విధంగా తొలి రోజు 8 గ్రాముల కంటే తక్కువగా ఉన్న వారు 46 మంది, మధ్యమంగా ఉన్న వారు 220 మంది, మైల్డ్‌గా ఉన్న వారు 314 మంది మొత్తంగా 580 మంది రక్తహీనతతో బాధపడుతున్నట్టు తేలింది. అంటే తొలిరోజు సగం మంది విద్యార్థులు రక్తహీనతతో బాధపడుతున్నట్టు స్ర్కీనింగ్‌లో స్పష్టమవుతున్నది. రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి సరైన చికిత్స అందించి రక్తహీనత రహిత జిల్లాగా తీర్చిదిద్దేదుకు కృషి చేస్తామని ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శశాంక్‌దేశ్‌పాండే తెలిపారు.

కస్తూర్బా విద్యాలయాల్లో 'వాయిస్ ఫర్ గర్ల్స్ ప్రోగ్రాం' షురూ



ఆర్సీపురంలోని ఉస్మాన్‌నగర్ కేజీబీవీలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వలంటీర్లు

సంగారెడ్డి అర్బన్, జనవరి 25 : సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో(కేజీబీవీ) వాయిస్ ఫర్ గర్ల్స్ కార్యక్రమం ప్రారంభమైంది. కౌమార దశలో బాలికలకు ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గురువారం ఆర్సీపురంలోని ఉస్మాన్‌నగర్, కొండాపూర్ కేజీబీవీలో వాయిస్ ఫర్ గర్ల్స్ స్వచ్ఛంద సంస్థ వలంటీర్లు అవగాహన కల్పించారు. బాలికల ఆరోగ్యం, సేఫ్టీ, హక్కులు, భవిష్యత్తు ప్రణాళిక, భద్రత, నైతిక విలువలు, సమాజంలో ఎలా జీవించాలి, మంచి చెడు తదితర అంశాలపై విద్యార్థినులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు, సీఆర్టీలు, విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

మా గ్రామం నుంచి రహదారి వద్దు

- సర్వే అధికారులకు విన్నవించిన చిన్నగుండవెల్లి గ్రామస్థులు



పంచాయతీ భవనంలో రైతులతో మాట్లాడుతున్న సర్వే అధికారులు

సిద్దిపేటరూరల్, జనవరి 25: సిద్దిపేట రూరల్ మండలంలోని చిన్నగుండవెల్లి గ్రామంలో రహదారి నిర్మాణానికి భూ సర్వే చేసేందుకు వచ్చిన అధికారులను స్థానికులు అడ్డుకున్నారు. గ్రామ రైతులు, గ్రామ పాలకవర్గ సభ్యులు అధికారులను గ్రామపంచాయతీకి పిలిపించి నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికే గ్రామం మీదుగా మల్లన్నసాగర్ కెనాల్ (అండర్ గ్రౌండ్) నిర్మాణం జరిగిందని, సోలార్ హైటెన్షన్ విద్యుత్ స్తంభాలు వేశారని, దీంతో రైతులకు అనేక ఇబ్బందులు ఏర్పడ్డాయని వాపోయారు. గ్రామం మీదుగా ఇప్పుడు రహదారి నిర్మిస్తామంటే మొత్తానికి నష్టం జరుగుతుందని వెల్లడించారు. తమ గ్రామం మీదుగా ఎలాంటి రహదారులు నిర్మించొద్దంటూ గ్రామపంచాయతీ వద్ద తీర్మానం చేసి సర్వే చేసేందుకు వచ్చిన అధికారులకు అందజేశారు.



గజ్వేల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాతీయ ఓటరు దినోత్సవంలో మాట్లాడుతున్న ఆర్డీవో బన్సీలాల్


వర్గల్: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా వృద్ధుడిని సన్మానిస్తున్న తహసీల్దార్ హరికిరణ్


బెజ్జంకి మండలం ముత్తన్నపేట పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

దేశ భవిష్యత్‌ను మార్చే సామర్థ్యం ఓటుకే ఉంది

- గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్
- పలు మండలాల్లో జాతీయ ఓటరు దినోత్సవం

గజ్వేల్/గజ్వేల్ టౌన్, జనవరి 25: దేశ భవిష్యత్‌ను మార్చే సామర్థ్యం ఒక్క ఓటుకే ఉన్నదని గజ్వేల్ ఆర్డీవో బీ.బన్సీలాల్ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, రాజనీతిశాస్త్ర విభాగంలో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని విద్యార్థులతో ఓటు హక్కు ప్రతిజ్ఞ చేయించారు. వారితో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.శ్రీనివాస్‌రెడ్డి, గజ్వేల్ తహసీల్దార్ బాల్‌రాజ్, వైస్ ప్రిన్సిపల్ గణపతి, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు. అలాగే గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పీవీ ఉమాశశి మాట్లాడారు. అధ్యాపకులు శ్రీనివాస్, జయరాజ్, కస్తూరిబాయ్, బాలచందర్, సరోజన, ఉమారాణి, దేవదాసు, సరోజ, విద్యార్థులు ఉన్నారు.

●సిద్దిపేట క్రైం: సమాజ స్థితిగతులను మార్చే శక్తి ఓటుకు మాత్రమే ఉన్నదని బీజేపీ మాజీ ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో గురువారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ సిద్దిపేట అసెంబ్లీ కన్వీనర్ ఉపేందర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సురేష్‌గౌడ్, గోనె మార్కండేయులు, ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

●నారాయణరావుపేట: ఓటర్లంతా ఓటు హక్కును వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యానికి నిజమైన పండుగ రోజు అని తహసీల్దార్ లక్ష్మారెడ్డి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా నారాయణరావుపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఓటర్లు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీపీ బాలకృష్ణ, ఎంపీడీవో మురళీధర్‌శర్మ, ఎంపీపీ ఉపాధ్యక్షుడు సంతోష్‌కుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు బాల్‌లక్ష్మి, పుష్ప, ఏఎన్ఎం పాల్గొన్నారు.

●చేర్యాల: చేర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రిన్సిపాల్ సర్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు కీలకమని తెలిపారు. అధ్యాపకులు వెంకటేశ్వర్లు, పరశురాములు, విద్యాసాగర్, రవి, స్వప్న, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.


●కోహెడ: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా కోహెడ మండల పరిషత్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు విద్యార్థులతో కలిసి ప్లకార్డుల ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ కొక్కుల కీర్తిసురేష్ హాజరై మాట్లాడారు. కోహెడ ఏఎంసీ చైర్మన్ తిప్పారపు జ్యోతిశ్రీకాంత్, ఎంపీటీసీ ఖమ్మం స్వరూప, తహసీల్దార్ సురేఖ, ఎంపీడీవో మధుసూదన్, డీటీ రాజిరెడ్డి, ఎంపీవో సురేష్, కార్యదర్శి దేవేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

●మద్దూరు: 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ అనంతరెడ్డి తెలిపారు. గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని మద్దూరు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. సీనియర్ ఓటర్లతో పాటు నూతన ఓటర్లను శాలువాతో సన్మానించారు. డిప్యూటీ తహసీల్దార్ గోపాల్, ఆర్ఐ రమేష్, సర్పంచ్ కంఠారెడ్డి జనార్ధన్‌రెడ్డి, ఉపసర్పంచ్ ఆరీఫ్, సెక్రటరీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అలాగే దూళిమిట్టలో రెవెన్యూ అధికారులు ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు.

●బెజ్జంకి: మండలంలోని ముత్తన్నపేట ఎంపీపీఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వడ్లకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

●వర్గల్: వర్గల్ మండల కేంద్రంలో రెవెన్యూ అధికారులు గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ హరి కిరణ్‌కుమార్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వయోవృద్ధులను సన్మానించారు. ఆర్ఐ రాజు, నాగరాజు, ఎలక్షన్ సూపర్‌వైజర్లు శ్రీశైలం, శ్రీనివాస్, నవీన్, బీఎల్‌వోలు పాల్గొన్నారు. వర్గల్ మండలం మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ, మాక్ పోలింగ్ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్స్ రాధారాణి, ఉమామహేశ్వరి, అధ్యాపకులు చందన, రజని పాల్గొన్నారు.

●హుస్నాబాద్ టౌన్: హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద తహసీల్దార్ రవీందర్‌రెడ్డి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఆఫీస్ రోడ్డు నుంచి గాంధీ చౌరస్తా, మల్లెచెట్టు చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తా వరకు విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ జరిపారు. అనంతరం మానవహారం నిర్వహించారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ రవీందర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కరుణాకర్, అధ్యాపక బృందం సదానందం, లక్ష్మయ్య, నిర్మలాదేవి, సంపత్ తదితరులున్నారు.


నారాయణరావుపేట: సీనియర్ ఓటరు వెంకటవ్వను సన్మానిస్తున్న ఎంపీపీ బాలకృష్ణ, తహసీల్దార్ లక్ష్మారెడ్డి

●దుబ్బాక/మిరుదొడ్డి: ఓటు హక్కుపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని దుబ్బాక, మిరుదొడ్డి తహసీల్దార్లు గోవర్ధన్, వెంకట్‌రెడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఎనగుర్తి సర్పంచ్ గుండా శంకర్ అన్నారు. గురువారం వేరువేరుగా దుబ్బాక, మిరుదొడ్డి రెవెన్యూ కార్యాలయాల వద్ద, ఎనగుర్తి గ్రామంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు.

●సిద్దిపేటరూరల్: ఓటు హక్కు విలువైనదని సిద్దిపేట రూరల్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి కుమారస్వామి పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం ముందు అధికారులు, సిబ్బందితో కలిసి జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. రూరల్ తహసీల్దార్ సలీం ఆధ్వర్యంలో రాఘవపూర్ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

●నంగునూరు: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నంగునూరులో తహసీల్దార్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

అప్పులు తీర్చలేక యువకుడి ఆత్మహత్య

- వర్గల్ మండలం శేరిపల్లిలో ఘటన


బోయిన ప్రభాకర్ మృతదేహం

వర్గల్, జనవరి 25: చేసిన అప్పులు తీర్చలేక మద్యానికి బానిసైన యువకుడు గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. వర్గల్ మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన బోయిన ప్రభాకర్(35)కు భార్య శ్యామల, ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నది. ప్రభాకర్ మూడేళ్ల క్రితం ఫైనాన్స్ ద్వారా ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. ట్రాక్టర్ సరిగ్గా నడవకపోవడంతో అప్పులు చేశాడు. అప్పులు తీర్చకపోవడంతో ఫైనాన్స్ వారు ట్రాక్టర్‌ను తీసుకెళ్లారు. అప్పటి నుంచి ప్రభాకర్ మద్యానికి బానిసై కుటుంబసభ్యులతో గొడవపడేవాడు. 20 రోజుల క్రితం తాగుడు కోసం ఇంట్లోని బియ్యం అమ్మడంతో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో శ్యామల పుట్టింటికి వెళ్లింది. గురువారం పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య శ్యామల ఫిర్యాదు మేరకు గౌరారం ఎస్ఐ విజయభాస్కర్ కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

గజ్వేల్ రూరల్, జనవరి 25: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. గజ్వేల్ మండలం బంగ్లా వెంకటాపూర్ గ్రామానికి చెందిన సల్లూరి జయరాములు(50) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే రెండునెలల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల అశోక్ లేలాండ్ ఆటోను తీసుకున్నాడు. బండి సరిగ్గా నడవక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. కాగా ఈ నెల 24న రాత్రి కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేసే సమయంలో అప్పుల విషయంపై మాట్లాడుతూ మనస్తాపానికి గురయ్యాడు. అదేరోజు రాత్రి అందరూ నిద్రించిన తర్వాత ఇంట్లోంచి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతకగా.. గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు. గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల సహాయంతో మృతదేహాన్ని కిందకు దింపి, పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు గజ్వేల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడికి సుమారు రూ.4 లక్షల వరకు అప్పులు ఉంటాయని గ్రామస్థులు తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడి మృతి


జహీరొద్దీన్ (ఫైల్)

తొగుట, జనవరి 25: చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతిచెందాడు. సిద్దిపేట పట్టణానికి చెందిన ఖాజా జహీరొద్దీన్(21) తొగుట మండలం పెద్ద మాసాన్‌పల్లి గ్రామంలో ఉన్న అమ్మమ్మ ఇంటికి 24న మధ్యాహ్నం వచ్చాడు. అదేరోజు బంధువులతో కలిసి గ్రామ సమీపంలోని పెద్ద చెరువులోకి చేపల వేటకు వెళ్లారు. చేపలు పట్టే క్రమంలో జహిరొద్దీన్ ప్రమాదవశాత్తు చెరువులో పడి గల్లంతయ్యాడు. కుటుంబీకులు రాత్రి వరకు ఎంత గాలించినా ఆచూకీ లభించకపోవడంతో మృతుడి తండ్రి నజీమొద్దీన్ గురువారం తొగుట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు అక్కడికి చేరుకుని గజ ఈతగాళ్లతో మృతదేహాన్ని బయటకు తీయించి, పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగం తెలిపారు.

నాలుగు ఆలయాల్లో చోరీ

జగదేవ్‌పూర్, జనవరి 25: మండల కేంద్రమైన మర్కుక్‌లోని ఒకేరోజు నాలుగు ఆలయాల్లో గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. మర్కుక్‌లోని మహంకాళీ ఆలయ తాళం పగులగొట్టి హుండీ, సీసీ కెమెరాలను, పెద్దమ్మ ఆలయంలో హుండీలోని డబ్బులు, వెండి తొట్టెలను, ఎల్లమ్మ ఆలయంలో హుండీ డబ్బులు, చిన్న బంగారు మంగళసూత్రం ఎత్తుకెళ్లారు. ముత్యాలమ్మ ఆలయంలో తాళాలు పగులగొట్టిన దుండగులు ఎలాంటి వస్తువులను ఎత్తుకుపోలేదు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శంకర్ తెలిపారు.

అష్టాదశ శక్తిపీఠ ఆలయంలో దక్షణావృత శంఖు పూజ


శంఖులకు పూజలు చేస్తున్న నిర్వాహకులు

కొండపాక, జనవరి 25: కొండపాక ఆనంద నిలయం ఆవరణలో గల అష్టాదశ శక్తిపీఠ సహిత ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం దక్షణావృత శంఖులతో పూజ నిర్వహించారు. శుక్రవారం 116 దక్షణావృత శంఖులతో స్వామివారికి అభిషేకం నిర్వహిస్తున్నట్టు ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్ వాస్తవ్యులు యామ జయలక్ష్మీవీరేశంగుప్తా లోక కళ్యాణార్థం శంఖులను పూజించి వితరణ చేయనున్నట్లు తెలిపారు.

'సెయింట్ మేరీస్'లో ముందస్తు గణతంత్ర వేడుకలు


వివిధ వేషధారణల్లో విద్యార్థులు

గజ్వేల్‌టౌన్, జనవరి 25: మండలంలోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్ పాఠశాలలో గురువారం ముందస్తు గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, స్వాతంత్ర్య సమరయోధులు సుభాష్ చంద్రబోస్, గాంధీజీ, నెహ్రూ, భరతమాత, భగత్‌సింగ్, బాలగంగాధర్ తిలక్ వేషధారణలతో ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ రాయప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి'

చిన్నకోడూరు, జనవరి 25: ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి చేర్చాలని ముదిరాజ్ సంఘం నాయకులు తుపాకుల బాల్ రంగం, జంగిటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం చిన్నకోడూరులు ఏర్పాటు చేసిన ముదిరాజ్ సంఘం మండల సమావేశంలో వారు మాట్లాడారు. ముదిరాజ్‌లు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి మత్స్య సొసైటీల్లో సభ్యత్వం ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు ముత్యం, తిరుపతి పాల్గొన్నారు.

సమాచారం

ఎమ్మెల్సీని కలిసిన కాంగ్రెస్ సిద్దిపేట నాయకులు

సిద్దిపేట టౌన్, జనవరి 25: గవర్నర్ కోటాలో నూతనంగా ఎమ్మెల్సీగా నియమించబడిన సియాసత్ పత్రిక ఎడిటర్ అమీర్‌అలీఖాన్‌ను సిద్దిపేటకు చెందిన కాంగ్రెస్ నాయకుడు వహీద్ ఖాన్ గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అమీర్‌అలీఖాన్‌ను నియమించడం ద్వారా రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమం కృషికి నిదర్శనమని, ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

'డబుల్ బెడ్‌రూం ఇళ్లకు తాగునీటి వసతి కల్పించాలి'

చేర్యాల, జనవరి 25: చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లకు తాగునీటి వసతి కల్పించాలని కోరుతూ కాలనీవాసులు గ్రామపంచాయతీ కార్యదర్శికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ మాట్లాడారు. అనుముల చంద్రకళ, తుంగ సౌజన్య, వేముల కళావతి, పద్మ, రమ తదితరులు పాల్గొన్నారు.

వార్డులోని సమస్యలను పరిష్కరించాలి: సీపీఎం

చేర్యాల, జనవరి 25 : చేర్యాల మునిసిపల్ 2వ వార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరించి ప్రజల ఇబ్బందులు తీర్చాలని సీపీఎం పట్టణ నాయకుడు పోలోజు శ్రీహరి అన్నారు. ఈ మేరకు గురువారం సీపీఎం బృందం వార్డు పరిధిలోని పలు వీధులను సందర్శించారు.

బూత్ లెవల్ శిక్షణకు తరలిన కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట టౌన్, జనవరి 25: పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరుగనున్న బూత్ లెవల్ కన్వీనర్ శిక్షణ శిబిరానికి కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

శ్రీశివ సన్నిధి సేవా సంస్థ దశమ వార్షికోత్సవం

హుస్నాబాద్ టౌన్, జనవరి 25: హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ శివ సన్నిధి పద్మశాలి సేవా సంస్థ దశమ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు దూడం నాగభూషణం, కొండా సత్యనారాయణ, వడ్డెపల్లి బాలయ్య, లక్ష్మీపతి, గాజుల భగవాన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు షూస్ పంపిణీ

చేర్యాల, జనవరి 25: చేర్యాల మండలం దానంపల్లి జడ్పీఎస్ఎస్ విద్యార్థులకు గ్రామానికి చెందిన మాదాసు మల్లేశం గురువారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో షూస్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ప్రవీణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి: ఎమ్మెల్యే

దుబ్బాక/మిరుదొడ్డి, జనవరి 25: ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మిరుదొడ్డి మండలం లింగుపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని, కాసులాబాద్ గ్రామంలో మహిళా భవనాన్ని, మిరుదొడ్డిలో బటర్‌ఫ్లై లైట్లను ప్రారంభించడంతోపాటు ధర్మారం గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే దుబ్బాక మండలం గోసాన్‌పల్లిలో గ్రామపంచాయతీ భవనాన్ని, చీకోడ్ గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రాన్ని, కూరగాయల మార్కెట్, గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయన వెంట దుబ్బాక, మిరుదొడ్డి ఎంపీపీలు పుష్పలత, సాయిలు, జడ్పీటీసీలు రవీందర్‌రెడ్డి, లక్ష్మీలింగం, ఎంపీపీ ఉపాధ్యక్షుడు రాజులు, సర్పంచులు, ఎంపీటీసీలు తుమ్మల బాల్‌రాజు, బాల్‌నర్సింహులు, రాములు, పుష్పలతాబాగులు, తౌడ శ్రీనివాస్, సుతారి నర్సింహులు, లక్ష్మీమల్లయ్య, శ్రీనివాస్ తదితరులున్నారు.


దుబ్బాక మండలం పెద్దచీకోడ్‌లో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

నిరుపేదలకు సేవ చేయడమే కాంగ్రెస్ లక్ష్యం

- కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి

గజ్వేల్, జనవరి 25: నిరుపేదలకు సేవ చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఆయా పార్టీలకు చెందిన 300మంది కార్యకర్తలు సయ్యద్ మతీన్, అబ్దుల్ వాహేద్, మహ్మద్ అజాహర్ ఆధ్వర్యంలో నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు సేవచేయడమే కాంగ్రెస్ లక్ష్యమని, అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ పథకాలు అందిస్తామన్నారు. వారి వెంట టీపీసీసీ నాయకులు నాయిని యాదగిరి, సర్దార్ ఖాన్, బెజుగామ శివరాంరెడ్డి, జమాల్‌పూర్ విఠల్, నాగరాజు నేత, మోహన్నగారి రాజు, మొక్తార్ ఉన్నారు.


నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ఆయా పార్టీల నాయకులు

రోడ్డు ప్రమాద నివారణలో భాగస్వాములం అవుదాం

- సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ

సిద్దిపేట క్రైం/చేర్యాల, జనవరి 25: రోడ్డు ప్రమాదాల నివారణలో అందరం భాగస్వాములం అవుదామని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ అన్నారు. గురువారం రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా సిద్దిపేట పట్టణం పాత బస్టాండ్ వద్ద ప్రజలకు, వ్యాపారస్తులకు, వాహనదారులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతీ వాహనదారుడు హెల్మెట్ ధరించాలని సూచిస్తూ కొమురవెల్లి పోలీసులు వినూత్న రీతిలో అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని కొమురవెల్లి మండలం రసూలాబాద్ శివారులో ఎస్ఐ నాగరాజు వాహనచోదకులకు గులాబీ పూలు అందించి హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పాటుపడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉన్నదని చెప్పారు.



ట్రాఫిక్ నియమాల గురించి అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ రామకృష్ణ

పత్తి కొనుగోలుకు 31 ఆఖరు

చేర్యాల, జనవరి 25: పత్తి రైతులు 31వ తేదీలోగా సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి విక్రయించాల ని, ఫిబ్రవరి 1 నుంచి కొనుగోలు నిలిపివేయనున్నట్లు సీసీఐ అధికారి అమిత్ గురువారం తెలిపారు. ఈ మేరకు చేర్యాల వ్యవసాయ మార్కెట్‌యార్డుతో పాటు మండలంలోని ఆయా జిన్నింగ్ మిల్లులలో నోటీసు బోర్డు ఏర్పాటుచేశారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా సీసీఐ కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. చేర్యాల ప్రాంతంలో 10,900మంది రైతుల ద్వారా గురువారం నాటికి 1.80లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశామని పేర్కొన్నారు. 10రోజుల్లోగా డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాలలో జమ అవుతున్నాయన్నారు. 1.40లక్షల క్వింటాళ్ల లక్ష్యంగా పెట్టుకున్నా అంతకుమించి కొనుగోలు చేపట్టామన్నారు.

భజరంగ్‌దళ్ గజ్వేల్ సంయోజక్‌గా నవీన్

గజ్వేల్, జనవరి 25: భజరంగ్‌దళ్ గజ్వేల్ పట్టణ సంయోజక్‌గా కాశమైన అలియాస్ ఢిల్లీ నవీన్‌ను నియమిస్తూ విశ్వహిందూ పరిషత్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పాములపర్తి ప్రభాకర్‌రెడ్డి, మెదక్ విభాగ్ సహా కార్యదర్శి గ్యాదరి రాజారాం ఉత్తర్వులు వెలువరించారు. గజ్వేల్ పట్టణంలో వీహెచ్‌పీ సమావేశాన్ని గురువారం నిర్వహించగా, గజ్వేల్ పట్టణ సంయోజక్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో భజరంగ్‌దళ్ బాధ్యతలు ఇచ్చిన జిల్లా పదాధికారులకు, పట్టణ కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నరేశ్‌బాబు, గీతారెడ్డి, వీహెచ్‌పీ సిద్దిపేట జిల్లా సంఘటన కార్యదర్శి రాధ, అల్లం దుర్గాప్రసాద్, గడీల చంద్రారెడ్డి, పోదిల శ్రీనివాస్ తదితరులున్నారు.

ఎస్ఎంసీ ఎన్నికల నిలుపుదల

- పాత కమిటీలను రద్దు చేస్తూ విద్యాశాఖ నిర్ణయం

సంగారెడ్డి అర్బన్, జనవరి 25:,సర్కారు బడుల్లో పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ)ఎన్నికల నిర్వహణను నిలిపివేస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు వెలువరించారు. ఎస్ఎంసీ ఎన్నికలు నాలుగేళ్లుగా నిర్వహించకుండా కమిటీ కాలాన్ని పొడిగిస్తూ వస్తున్నారు. తాజాగా ఈ నెల 18న ఎన్నికల నిర్వహణకు విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ ఆ ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ, ప్రస్తుతమున్న కమిటీలను రద్దు చేస్తూ విద్యాశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత విద్యా సంవత్సరం మరో మూడు నెలలే ఉండడం, కొత్త విద్యా సంవత్సరం ప్రారంభంలో ఎన్నికలు నిర్వహించాలని కొన్ని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని కోరినట్టు తెలిసింది. దీంతో ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణ నిలిపివేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది.

జీవో 55ను వెనక్కి తీసుకోవాలి: ఏబీవీపీ

సిద్దిపేట క్రైం, జనవరి 25: వ్యవసాయ ఉద్యాన వర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయించొద్దని, జీవో నెంబరు 55ను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బీరకాయల వివేక్‌వర్ధన్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన సిద్దిపేట ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం యూనివర్సిటీ వద్ద నిరసన తెలిపిన విద్యార్థులపైన, రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీపైన పోలీసులు ప్రవర్తించిన తీరు దారుణమన్నారు. దీనికి కారణమైన కానిస్టేబుల్స్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సిద్దిపేట పట్టణంలో రిపబ్లిక్ డే సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కన్వీనర్ అరుంధతి, జిల్లా హాస్టల్స్ కన్వీనర్ చరణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పవన్ తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

'దుబ్బాక మున్సిపాలిటీ అవినీతిపై ఎమ్మెల్యే స్పందించాలి'

దుబ్బాక, జనవరి 25: దుబ్బాక మున్సిపాలిటీలో, దుబ్బాక వ్యవసాయ సహకార సంఘంలో జరిగిన అవినీతిపై ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి స్పందించాలని దుబ్బాక మున్సిపాలిటీ 3వ వార్డు కౌన్సిలర్ మట్టా మల్లారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం దుబ్బాక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బీజేపీ నాయకులతో కలిసి మాట్లాడారు. దుబ్బాక మున్సిపాలిటీలో హరితహారం పేరుతో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు శ్రీనివాస్, ప్రవీన్, శ్రీకాంత్ తదితరులున్నారు.

మాజీ ఎమ్మెల్యే మాటలు హాస్యాస్పదం

దుబ్బాక మున్సిపాలిటీ పాలకవర్గంపై, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు అసత్య ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత, కౌన్సిలర్లు మీనా, యాదగిరి, కోఆపరేటివ్ సభ్యుడు స్వామి అన్నారు. మున్సిపాలిటీ వద్ద మాట్లాడారు. 3వ వార్డు కౌన్సిలర్‌కు నిధులు కేటాయించడం లేదంటూ రఘునందన్‌రావు మున్సిపల్ పాలకవర్గంపై, ఎమ్మెల్యేపై మరోకసారి ఆరోపణలు చేస్తే ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు.

దేశాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలి

గజ్వేల్, జనవరి 25: భారతదేశ అభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. నమో నవమత్ దాత సమ్మేళన్ కార్యక్రమంలో భాగంగా గజ్వేల్ పట్టణంలోని బీఎంఆర్ కళాశాలలో ప్రత్యేక స్ర్కీన్‌ను ఏర్పాటు చేశారు. యువతకు పలు సలహాలు, సూచనలు చేశారు. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్‌యాదవ్, బీజేపీ నాయకులు నత్తి శివకుమార్, కార్యవర్గ సభ్యులు మహిపాల్‌యాదవ్, మన్నె శేఖర్, ఆర్కే యాదవ్, మహేశ్‌చారీ ఉన్నారు.


నరేంద్రమోదీ సంభాషణను వింటున్న దృశ్యం